పత్రికాప్రకటన కాకినాడ, 23.7.2018

వచ్చే అక్టోబరు-2 నాటికి వివిధ గృహనిర్మాణ పథకాల క్రింద జిల్లాలో మరో 10వేల ఇళ్లలో లబ్దిదారులు గృహ ప్రవేశాలు చేసేందుకు నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా ఆదేశించారు.

సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా జిల్లా, డివిజనల్, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి శాఖల వారీగా పభుత్వ ప్రాధాన్యతా పథకాల అమలు, వివిధ ప్రోజెక్టల క్రింద అభివృద్ధి పనులు పురోగతిని సమీక్షించారు.

తొలుత నిర్వహించిన ప్రోజెక్ట్ పనులు పురోగతి సమీక్షలో ఎన్‌హెచ్-216 విస్తరణలో కత్తిపూడి-కాకినాడ ప్యాకేజి-1 రహదారిని ఈ నెలాఖరునాటికి ట్రాఫిక్ సంచారానికి అనువుగా అప్పగించాలని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. ప్యాకేజి-3 పనులను టాటాప్రోజెక్ట్స్ సంస్థ నత్తనడకగా చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్యాకేజి-4 క్రింద ఇప్పటి వరకూ అప్పగించిన 2.55 కిమి మేర పనులు వెంటనే మొదలు పెట్టాలని ఏజెన్సీని ఆదేశించారు. ఏడిబి రోడ్డు విస్తరణ పనులకు ఆమోదాలు జారీ అయినందున ఏజెన్సీ ఖరారు, టెండర్ల ప్రక్రియ వెంటనే చేపట్టాలని ఆదేశించారు. రాజానగరం నుండి గామన్ బ్రిడ్జి వరకూ ఛిద్రమైన రహదారిని వెంటనే పునరుద్దరించాలన్నారు. భారతమాలా బీచ్‌రోడ్ సర్వే, పెగ్ మార్కింగ్ తో పాటు భూసేకరణ ప్రక్రియను కూడా ముమ్మరం చేయాలని, కాకినాడ నగరంలో చేపట్టిన స్మార్ట్ రోడ్-1 పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న 5 తహశీల్దార్ కార్యాలయ భవనాలు అక్టోబరు మొదటి వారంలో ప్రారంభానికి సిద్దం కావాలన్నారు. పర్యాటకాభివృద్ధి క్రింద చేపట్టిన పనుల తుది మెరుగులు పూర్తి చేసి నిర్వహణలోకి తేవాలని ఆదేశించారు.

2018-19 సంక్షేమా కార్పొరేషన్ రుణాల జారీలో ప్రక్రియలో ఎంపిక చేసిన లబ్దిదారుల జాబితాలను బ్యాంకులకు పంపడంలో మున్సిపల్ కమీషనర్ల తాత్సారం పట్ల జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని మున్సిపాలిటీలలో లబ్దిదారుల జాబితాలు మంగళవారం మధ్యాహ్నానికల్లా బ్యాంకులకు పంపాలని, లేని పక్షంలో తీవ్రంగా పరిగణించడం జరుగుతుందన్నారు.

హౌసింగ్ సమీక్షలో గత వారం వివిధ ఎన్‌టిఆర్ , అందరికీ ఇళ్లు పథకాల క్రింద గత వారం 904 ఇళ్ల నిర్మాణం జరిగిందని, ఈ నిర్మాణాలను వారానికి కనీసం 1200 ఇళ్లు స్థాయికి ముమ్మరం చేసి, వచ్చే అక్టోబరు-2న కనీసం 10 వేల మంది లబ్దిదారులు గృహప్రవేశం చేసేందుకు రంగం సిద్దం చేయాలని కోరారు. హౌసింగ్ యాప్‌లో డేటా ఎంట్రీ తప్పులు లేకుండా ఎంట్రీ చేయించాలని, వారంలో ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలను 30 శాతం మించి సాధించలేని అధికారులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

ఉపాధి హామీ పథకం క్రింద జిల్లాలో చేపట్టిన విలేజి పార్కులు, సోక్‌పిట్‌లు, ఎవెన్యూ ప్లాంటేషన్, క్రీడా మైదానాలు తదితర పనులను నాణ్యతతో వేగంగా నిర్వహించాలన్నారు. ప్రతి నెల కనీసం 50 అంగన్‌వాడీ భవనాల నిర్మాణం పూర్తి కావాలని ఆదేశించారు.

వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో రామచంద్రపురం డివిజన్‌లోని పేకేరు పిహెచ్‌సి పరిధిలో సంభవించిన మాతా మరణానికి కారణాలను సమీక్షించి, హైరిస్క్ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆశా వర్కర్ సస్పెన్షన్‌కు ఆదేశించారు. జిల్లాలోని పట్టణ ప్రాంతాలలో హైరిస్క్ గర్భధారణల సర్వేలో 805 కేసులు గుర్తించారని, వీరిలో ప్రతి మహిళా సురక్షితంగా ప్రసవించి, తల్లి బిడ్డా సురక్షితంగా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య అధికారులను ఆదేశించారు. వచ్చే శుక్రవారం నాటికి చంద్రన్న సంచార వైద్య సేవా ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని హైరిస్క్ గర్భదారణలను కూడా గుర్తించి, కేసులను ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని ఆదేశించారు. ఏఎన్ఎంలకు జీతాల చెల్లింపు జాప్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ, బుధవారం నాటికి అందరికీ జీతాలు చెల్లించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.మల్లికార్జున, డిఎఫ్ఓ నందని సలారియా, హౌసింగ్ పిడి జి.వి.ప్రసాద్, డ్వామా పిడి బి.రాజకుమారి, సంక్షేమ కార్పొరేషన్ల ఈడిలు యం.జ్యోతి, డేవిడ్‌రాజు, ప్రభాకరరావు, డియంహెచ్ఓ ప్రసన్నకుమార్, ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, డివిజనల్ అధికారులు, యండిఓలు, తహశీల్దారులు, ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)..